

ఇకెవైసికి గిరిజనుల అవస్థలు

ప్రజాశక్తి -హుకుంపేట: మరుముల ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో నెట్ సేవలు అందుబాటులో లేక పోవడంతో ఇకెవైసి కోసం గిరిజనులు అవస్థలు పడుతున్నారు. పట్టాం, గత్తుం పంచాయతీలో సేవలు లేక పోవడంతో గృహాల లబ్ధిదారులు ఇ కేవైసీ సేవల కోసం అవస్థలు పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి విఆర్వోలతో పాటు ప్రజలు నెట్ సేవలు కోసం ఎదురుచూశారు. ఓల్డా పంచాయతీలో ఇళ్లు నిర్మాణం చేస్తున్న వారు ఇకెవైసి చేయించుకోవాలి. లేకపోతే ఇళ్లు మంజూరు కాదు.



నిరీక్షిస్తున గిరిజనులు

12 ఏళ్ల తర్వాత మళ్లీ..

-డిఎస్‌సిలో అప్రెంటిస్ విధానం
-భగ్గుమంటున్న నిరుద్యోగులు, నాయకులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అధికారంలోకి రాగానే మెగా డిఎస్‌సి అంటూ ప్రతిపక్ష నేతగా జగన్ మోహన్ రెడ్డి నిరుద్యోగులను ఊరించారు. ఎన్నికల సభల్లోనూ గొప్పగా ఊదరగొట్టారు. గద్దెనెక్కిన తర్వాత ఆ ఊసే మరిచారు. ప్రస్తుత తరుణంలో డిఎస్‌సి పేరుతో నాటకానికి తెర లేపారు. ఇందులోనూ అరకొర పోస్టులే ఉండటం అప్రెంటిస్ విధానానికి మళ్లీ తెరలేపారు. దీంతో నిరుద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. గద్దెనెక్కించిన తామే గద్దె దించేందుకు సిద్ధమంటూ మండిపడుతున్నారు.

12 ఏళ్ల తర్వాత మళ్లీ..

2024 డిఎస్‌సి విడుదల చేయాలని మంత్రి మండలి ఇటీవల తీర్మానించింది. కొత్తగా నియమితులయ్యే వారికి అప్రెంటీస్ విధానం అమలు చేయాలని ఇందులో నిర్ణయించారు. గతంలో ఉన్న ఈ విధానాన్ని 2011లో అప్పటి ప్రభుత్వం రద్దు చేసింది. 12 ఏళ్ల తర్వాత మళ్లీ అమలు చేయాలని వైసిపి ప్రభుత్వం భావిస్తోంది. దశాబ్దాలుగా ఉద్యోగాలు చేస్తున్న ఉపాధ్యాయులే వేతనాలు సక్రమంగా అందక, వివిధ రకాల మానసిక ఒత్తిళ్లతో ఉద్యోగాలు చేయలేమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించినా రెండేళ్లపాటు అప్రెంటీస్‌గా ఉండాల్సి రావడంపై మండిపడుతున్నారు. అసలే అరకొర పోస్టులతో ప్రకటన ఇవ్వడం ఆపై అప్రెంటిస్ విధానం అమలు చేస్తామనడం ఇటు డిఎస్‌సి అభ్యర్థులు, అటు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల ఆగ్రహానికి కారణమైంది. అప్రెంటిస్ లేకుండా డిఎస్ సి నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

తక్కువ వేతనంతో కష్టమే

అప్రెంటిస్ విధానం ఉన్నప్పుడు విధుల్లో చేరాను. ప్రభుత్వం ఇచ్చే వేతనం రవాణా చార్జీలకే సరిపోయేది. ప్రస్తుతమైతే అప్రెంటిస్‌లో ఇచ్చే వేతనం అందుకు కూడా సరిపోవు. ప్రైవేట్ దుకాణాల్లో పనిచేస్తే ఇప్పుడు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఇస్తున్నారు. కొత్తగా వచ్చే ఉపాధ్యాయులకు అంతకంటే తక్కువ ఇస్తామని ప్రభుత్వం చెబుతుండడం దారుణం.



వి.వెంకటరమణ
బిటిఎ జిల్లా అధ్యక్షుడు

హక్కులు కాలరాస్తున్నారు...

ఎన్నో సంవత్సరాలుగా పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను వైసిపి ప్రభుత్వం కాలరాస్తోంది. అప్రెంటిస్ విధానం 2011లోనే అప్పటి ప్రభుత్వం రద్దు చేసింది. తిరిగి ఇప్పుడు మళ్లీ అమలు చేయాలని చూడడం దారుణం. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. డిఎస్‌సిలో పోస్టల్ సంఖ్య పెంచి నిరుద్యోగులకు న్యాయం చేయాలి.



ఆర్.జగన్ మోహన్ రావు
ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు

రద్దు చేయాలి

అప్రెంటిస్ విధానం అమలు చేయడం అంటే కొత్త ఉపాధ్యాయులను బానిసత్వంలోకి నెట్టడమే అవుతుంది. రెండు సంవత్సరాల పాటు చాలీచాలనీ వేతనంతో పని చేయాలి. వెట్టి చాకిరి చేయాలి. ఆ బాధలు వర్ణనాతీతం. మళ్లీ అదే విధానం అమలు చేయాలనుకోవడం బాధాకరం. అప్రెంటిస్ లేకుండా డిఎస్ సి నిర్వహించాలి. స్పెషల్ డిఎస్‌సి పోస్టులను భర్తీ చేయాలి.

వి.మహేశ్వర రావు
యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

రెగ్యులర్ గానే ఉండాలి

14 సంవత్సరాలు పోరాడి రద్దు చేయించుకున్న అప్రెంటిస్ విధానాన్ని మళ్లీ పునరుద్ధరించడాన్ని ఖండిస్తున్నాం. వైసిపి ప్రభుత్వ నిర్ణయం నిరుద్యోగ ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం. ఒకవైపు పాత పెన్షన్ అమలు చేయాలని పోరాటాలు చేస్తుంటే ఇప్పుడు అప్రెంటిస్ ను రద్దు చేయమని భవిష్యత్తులో పోరాటాలు చేయాల్సిరావడం దురదష్టకరం. ఉపాధ్యాయ నియామకాలన్నీ రెగ్యులర్ గానే ఉండాలి. వారిని పూర్తి వేతనంతో నియమించాలి.



ఈశ్వరరావు
సిపిఎస్ ఉద్యోగుల సంఘం
జిల్లా అధ్యక్షుడు

బాలికపై అత్యాచారం

ప్రజాశక్తి- పెదబయలు : మండలంలోని అడుగుల పుట్టు పంచాయతీ లాకెపుట్టు గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలికపై 22 ఏళ్ల యువకుడు మాయమాటలు చెప్పి అత్యాచారం చేసినట్లు స్థానిక ఎస్ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన 7 సంవత్సరాల వయసు గల బాలిక బడికి వెళుతుండగా మాయ మాటలు చెప్పి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. సాయంత్రం అయినా బాలిక కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పరిసర ప్రాంతంలో గాలించారు. లకే పుట్టు అటవీ ప్రాంతంలో బాలికను కుటుంబసభ్యులు గుర్తించారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ మనోజ్ కుమార్ తెలిపారు.

అక్రమ అరెస్టులపై ఆశాల నిరసనలు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమం సందర్భంగా ఎక్కడికక్కడ నిర్బంధించడం, విజయవాడలో అక్రమంగా అరెస్టులు చేయడంపై శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిరసనలు వెల్లువెత్తాయి.

ప్రజాశక్తి-కూనవరం

కూనవరం మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యాన ఆశా వర్కర్లు శుక్రవారం మానవహారం చేశారు. అనంతరం కూనవరం నుండి టేకులబోరు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కొమరం పెంటయ్య మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించకుండా అక్రమంగా కేసులు పెట్టడం తగదన్నారు. ఆశాల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మేకల నాగేశ్వరరావు, రేణుక, రాణి, శారదా, భద్రమ్మ, ఝాన్సీ, రుక్మిణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.


రాజవొమ్మంగిలో రాస్తారోకో చేస్తున్న ఆశా వర్కర్లు

రాజవొమ్మంగి : ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, అక్రమ అరెస్టులను ఖండిస్తూ సిఐటియు ఆధ్వర్యాన శుక్రవారం రాజవొమ్మంగి ఆర్ అండ్ బి అతిథి గృహం నుండి అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద ర్యాలీ నిర్వహించి, అక్కడ రహదారిపై ఆశా వర్కర్లు రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు పి.రామరాజు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎ.అమ్మిరాజు, కె.చంద్రావతి, లక్ష్మీశ్రీ తదితరులు మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లుకు కనీస వేతనం చెల్లించాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్ అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు టి శ్రీను, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కె బాలమ్మ, సీత, భవాని, నూకరత్నం, చెల్లయమ్మ, దుర్గ, సూర్యావతి, ఈ.సత్యవతి, పెద్ద సంఖ్యల ఆశ వర్కర్ల పాల్గొన్నారు.



కూనవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

విఆర్.పురం : ఆశా వర్కర్ల చలో విజయవాడ సందర్భంగా హౌస్ అరెస్టులు, అక్రమ నిర్బంధాలపై సిఐటియు ఆధ్వర్యాన ఆశా వర్కర్లు రేఖపల్లిలో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పూనం సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం ఆశాల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాలు నూతన కవిత, ఉంగుటూరు అలివేలు, సుబ్బలక్ష్మి, కన్నమ్మ, సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్ సుబ్బారావు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని వినతి

ప్రజాశక్తి -సీలేరు

విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు రెగ్యులరైజ్ చేస్తానని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిలబెట్టుకోవాలని సిఐటియు అల్లూరు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీలేరు డొంకరాయి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు 19 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీలేరు ఏపీ జెన్కో ఈఈ లక్ష్మీనారాయణ, ఈఈ సివిల్ ప్రభాకర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ ఎన్నికల సమీపిస్తున్నా గత ఎన్నికల నాటి కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి మనసు మార్చుకొని కార్మికులు న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని, వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జీకే వీధి మండల కార్యదర్శి జి.సత్యనారాయణ, యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎస్‌కె.సుభాన్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు బి.లక్ష్మణ్, విష్ణుకుమార్, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న విద్యుత్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు

పంతలచింతలో చీరల పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని పంతలచింత గ్రామంలో గుంటూరులోని బండి సాహిత్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆ ట్రస్ట్ అధినేత బండి అశోక్ రెడ్డి నిరుపేద గిరి మహిళలు 50 మందికి ఉచితంగా చీరలను పంపిణి చేశారు. నిరుపేద గిరిజనులకు ఇటువంటి సేవలు అందించడం ఎంతో సంతృప్తిని కలిగిస్తుందని అశోక్ రెడ్డి చెప్పారు. గతంలో మండలంలోని బొందు గూడ గ్రామంలో కూడా ఉచితంగా చీరలు పంపిణి కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నగర కార్పొరేటర్ లక్ష్మి శ్రీనివాసరెడ్డి, తారకరామా ఆర్గానిక్స్ ప్రతినిధులు రామకృష్ణ, నరేష్, గ్రామస్తులు నీలకంఠం, పరశురాం తదితరులు పాల్గొన్నారు.


చీరలు పంపిణీ చేస్తు దాత

నులి పురుగులతో రక్తహీనత

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాధన

ప్రజాశక్తి పాడేరు :- జాతీయ నులిపురుగుల నివారణ దినం లో భాగంగా తలారి సింగి ప్రభుత్వ బాలుర పాఠశాలలో 540 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణకు గాను ఆల్బెండజోల్ మాత్రలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సిహెచ్.సాధన, హెచ్ఎం ఆర్.జాన్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ మాత్రలను వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ఈ మాత్రలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి వేసుకోవడంతో పొట్టలో ఏర్పడే నులిపురుగులను మనం నివారించవచ్చన్నారు. రక్త హీనత బారి నుండి పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని, తెలిపారు. భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, గోర్లను ఎక్కువగా పెంచుకోకూడదని సూచించారు. పరిశుభ్రమైన ఆహారం తినాలని, నులి పురుగులు పొట్టలో ఏర్పడడం వల్ల రక్తహీనత ఏర్పడడమే కాకుండా మనకు వ్యాధులు సంక్రమించినప్పుడు ఆ వ్యాధి తీవ్రతను తట్టుకోలేక ప్రాణాపాయం కలిగే అవకాశం ఎక్కువగా ఉందని తెలిపారు. నులిపురుగులు పొట్టలో ఉండడం మూలంగా మంద బుద్ధి ఏర్పడుతుందన్నారు. ఆరు నెలలకు ఓసారి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, హెల్త్ అసిస్టెంట్ శెట్టి నాగరాజు, ఆశ వర్కర్ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.


మాత్రలు వేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాధన

ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి : ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి-అరకులోయ : ఆదివాసి డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలని ఆదివాసి స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా స్థానిక ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ మాట్లాడుతూ, పాడేరు ఐటీడీఏ పరిధిలో ఆదివాసీ డిఎస్సీ అభ్యర్థులు వేల సంఖ్యలో ఉన్నారని, శిక్షణ కేంద్రాలకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి అప్పుల పాలవుతున్నారని ఆయన అన్నారు. పాడేరు ఐటిడిఏ ఆధ్వర్యంలో అరకువేలి, పాడేరు, చింతపల్లి కేంద్రాల్లో ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇచ్చి తోడ్పాటు అందించాలని కోరారు. ప్రభుత్వ ఆదివాసి స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమ శాఖ, మండల ప్రజా పరిషత్ పాఠశాలల్లో 800 పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఎస్జీటీ ఉపాధ్యాయ పోస్టులు ఎన్ని కేటాయించారో స్పష్టత లేక గందరగోళాలకు ఆదివాసి డీఎస్సీ అభ్యర్థుల గురవుతున్నారన్నారు. స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ జారీ చేసి 800 పైచిలుకు ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం అరకులోయ మండల అధ్యక్షులు జి. బుజ్జిబాబు, మండల ఉపాధ్యక్షులు పి.నానిబాబు మండల సహాయ కార్యదర్శి కే.బుజ్జిబాబు పాల్గొన్నారు.

నేడు చింతపల్లిలో షర్మిల బహిరంగ సభ

ప్రజాశక్తి - చింతపల్లి: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చింతపల్లి పర్యటనకు ఈనెల 10న రానున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు లకే వెంకటరమణ అన్నారు. ఆ పార్టీ ఆదేశాల మేరకు బస్సు యాత్ర చేపట్టిన షర్మిల చింతపల్లి మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభకు ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారని తెలిపారు. చింతపల్లి లో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

డుంబ్రిగుడ: చింతపల్లిలో ఈ నెల 10న కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకుడు ఎస్ గంగాధర స్వామి పిలుపునిచ్చారు. మండలంలోని కంద్రుమ్ పంచాయతీ సర్రాయిలో శుక్రవారం బహిరంగ సభ జయప్రదం కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గిరిజన ప్రాంతంలో అభివృద్ధి పనులు జరిగాయన్నారు.

పోలింగ్ బూత్‌ల్లో మౌలిక సదుపాయాలు కల్పన

అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి రంపచోడవరం

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ బూతులలో కరెంటు, రన్నింగ్ వాటర్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, భవనాలకు మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో రంపచోడవరం మండలానికి చెందిన సెక్టార్ అధికారులు, పోలింగ్ బూత్ స్థాయి అధికారులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ బూత్ స్థాయి అధికారులు ఓటర్లకు ఫారం-6, 8లను వారం లోపల పెండింగ్ లేకుండా సమర్పించాలన్నారు. బూత్ స్థాయి అధికారులు ఓటర్ లిస్టులో మార్పులు, చేర్పులు సంబంధించిన లిస్టులన్నీ ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా పైఅధికారులకు నివేదికలు సమర్పించాలని సూచించారు. ఓటర్ లిస్ట్ నుండి ఎవరి పేరైనా తొలగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సంఘం నిబంధనలు ప్రకారం ప్రభుత్వ యంత్రాంగం పనిచేయాలన్నారు. సెక్టార్ అధికారులకు మెజిస్ట్రేట్ పవర్ ఉంటుందని చెప్పారు. అన్ని మండలాల్లో రిజర్వ్ ఈవీఎంలు అందుబాటులో ఉంటాయని, ఈవీఎంలు పనిచేయకుంటే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్, తహశీల్దారు ఎ.కృష్ణ జ్యోతి, డిప్యూటీ తహశీల్దార్లు ఎన్‌వివి.సత్యనారాయణ, బి.రాజు. సుబ్బారావు, ఆర్ఐ యం.విగ్నేష్, యస్ఎలు ఇందిరా బాయ్, టి.లక్ష్మణ్, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. అనంతరం మారేడుమిల్లి మండలం జిఎంవలస గ్రామానికి చెందిన వికలాంగుడు ముట్టెం శివ శంకర్ వరప్రసాద్ దొర వికలాంగ పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు సమర్పించారు. వివిధ సమస్యలపై ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన

రంపచోడవరం మండలం పెద గెద్దాడ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే శుక్రవారం సందర్శించారు. ఆస్పత్రికి ప్రతిరోజు ఎంతమంది వ్యాధిగ్రస్తులు వస్తున్నారు, వారికి ఏ విధంగా రక్తపరీక్షలు చేస్తున్నారు తదితర విషయాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిహెచ్‌సిలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ బంధం శ్రీదేవి, పెదగెద్దాడ సర్పంచ్ వి.ప్రసాద్, ఏడిఎం అండ్ హెచ్‌ఓ జి.ప్రకాశం, మండల వ్యవసాయ శాఖ అధికారి కె.లక్ష్మణ్, ఉపాధ్యాయులు కె.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు అభినందనలు

మండలంలోని పెద్ద గెద్దాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ రంపచోడవరం ఐటీడీఏ పీవో, ఎంపీపీ పాఠశాలను సందించారు. అనంతరం 2023-24 ఎమ్ఎన్ఎన్ఎస్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించిన ఎనిమిదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. అనంతరం అర్హత సాధించిన విద్యార్థులు నెరం జ్యోతిమణి, కానెం శ్రవణ్ కుమార్, కడపల జగదీశ్‌రెడ్డి, పల్లాల దేవి ప్రియాంకలను సర్పంచ్ గ్రామ పెద్దలు సమక్షంలో అభినందించారు. వారికి వ్యవసాయ అధికారి కె లక్ష్మణ్ ప్రత్యేక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, ఎంపీపీ బంధం శ్రీదేవి, సర్పంచ్ ప్రసాద్, విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్ఎన్ఎన్ఎస్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

తరచూ మొరాయిస్తున్న యూనియన్ బ్యాంకు ఎటిఎం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులోని యూనియన్ బ్యాంక్ ఎటిఎం తరచూ మొరాయిస్తోంది. దీంతో వినియోగదారులు అనేక అవస్థలు పడుతున్నారు. సీలేరు, దారకొండ, దుప్పిలివాడ, గుమ్మరేవులు పంచాయతీ ప్రజలతో పాటు ఒడిశాలోని చిత్రకొండ ప్రాంత ప్రజలు సీలేరు యూనియన్ బ్యాంక్ ఏటీఎంపైనే ఆధారపడి ఉన్నారు. ఏ చిన్న అవసరం వచ్చిన ఏటీఎంకి వచ్చి డబ్బులు విత్ డ్రా చేసుకుంటారు. కొన్నాళ్లుగా ఏటీఎం తరచూ మరమ్మతులు గురు కావడంతో వినియోగదారులు డబ్బులు కోసం ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై బ్యాంకు మేనేజర్ చెన్నారావుని వివరణ కోరగా ఏటీఎంలో సాంకేతిక లోపాలు తలెత్తడంతో ఇబ్బంది వస్తుందని, లోపాలను ఎప్పటికప్పుడు సరి చేస్తూ ఖాతాదారులు ఏటీఎం అందుబాటులో వచ్చే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. కొంతమంది వినియోగదారులకు అవగాహన లేక పరిమితికి మించి డిపాజిట్, విత్‌డ్రాలు చేయడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై వినియోగదారులకు అవగాహన కలగడానికి ఏటీఎం వద్ద నోటీసు బోర్డు వివరాలతో అతికించామని చెప్పారు. ఏటీఎంలో నెలకొన్న సాంకేతిక లోపాలు సవరించడానికి చర్యలు చేపడుతున్నామని మేనేజర్ చిన్నబాబు వెల్లడించారు.



మూతపడిన యూనియన్ బ్యాంకు ఎటిఎం

రోడ్డు మరమ్మతు చేయకుంటే ఎన్నికల బహిష్కరణ



మాట్లాడుతున్న మహిళలు

ప్రజాశక్తి-హుకుంపేట: తమ గ్రామానికి రోడ్డు బాగు చేయకుంటే ఎన్నికలు బహిష్కరిస్తామని మండలంలోని గత్తుం పంచాయతీ గాలిపాడు గ్రామ గిరిజనులు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ఎన్నోసార్లు తిరిగినా స్పందన లేదు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయడానికి వెళ్ళకుండా బహిష్కరిస్తున్నామని గాలిపాడు గ్రామ ప్రజలు శుక్రవారం పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించనప్పుడు ఓటును ఎందుకు వేయాలని ప్రశ్నించారు. ఓటు వేయడానికి వెళ్ళ లేదని గ్రామ ప్రజలు స్పష్టం చేశారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి



సమస్యలు తెలుసుకుంటున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి- అనంతగిరి:మండలంలోని మారుమూల పెద్దకోట పినకోట పంచాయతీల పరిధిలో గ్రామలకు రోడ్డు, తాగునీటి వంటి మౌళిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని సీపీఎం జెడ్పీటీసీ దీసరి. గంగరాజు అన్నారు మండల సీపీఎం బృందం కలిసి శుక్రవారం పెదకొట, కొండిభకోట నుండి చింతలపాలేం, రేగులపాలేం నుండి ఖాళి నడకన పర్యటించారు. గిరిజన ప్రజలతో కలిసి పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, నేటికీ డోలీ మోతలకు పరిమితం అవుతూ గిరిజనులు ప్రాణాలు పోతున్నాయన్నారు కొండిభకోట నుండి చింతలపాలేం వరకు 4 కిల్లోమీటర్లు రేగులపాలేం నుండి టముటు రోడ్డు జముడుగుమి నుండి బిల్లకంభ వరకు రోడ్డు సౌకర్యాలు లేవనీ ఈ సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడి జిల్లాల చైర్మన్ జల్లిపల్లీ సుభద్ర, కలెక్టర్ సుమీత్ కుమార్ దృష్టికి తీసుకు వెళతానన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దకోట సర్పంచ్ శిరగం అన్నపూర్ణ, వేంగడ మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ మండల నాయకులు గెమ్మెల దేవన్న, దీసరి బుద్దురాజు, మజ్జి రామన్న, జన్ని ఈశ్వరరావు వార్డు మెంబర్ గోవింద్, పాల్గొన్నారు

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: మండలంలోని కించుమండ ఆశ్రమ బాలుర పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 214 మంది వ్యాధిగ్రస్తులు పాల్గొనగా వారికి వైద్య అధికారులు వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు.ఈ శిబిరంలో ప్రత్యేక వైద్య నిపుణులు విజయ్ కుమార్, దుంబ్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.రాంబాబు, కుమార్ రత్న, తహసిల్దార్ హేమావతి, సర్పంచ్, వైద్య సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

వైసిపి వైఫల్యాలపై టిడిపి ర్యాలీ

ప్రజాశక్తి-పాడేరు: వైసిపి వైఫల్యాలను ఎండగడుతూ పాడేరు పట్టణంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి టికెట్ ఆశిస్తున్న యువ నాయకుడు కిల్లు రమేష్ నాయుడు ఆధ్వర్యంలో పాడేరు మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ నాయుడు మాట్లాడుతూ,ప్రజల్లో వైయస్సార్సీపి పట్ల తీవ్ర విముఖత ఏర్పడిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైయస్సార్సీపి ఇంటి బాట పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అడపా నరసింహమూర్తి నాయుడు పాల్గొన్నారు.

వయోజన విద్యా కేంద్రాల నిర్వహణకు శిక్షణ

ప్రజాశక్తి-రంపచోడవరం:ఏజెన్సీలోని నిరక్షరాస్యతను నిర్మూలించడానికి మాస్ వెల్ఫేర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వయోజన విద్య కేంద్రాలు నడపడానికి సుమారు 30 మంది ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని సంస్థ అధ్యక్షులు గడ్డం గడ్డమ్మ ఆధ్వర్యాన ఈనెల 5 నుండి 8వ తేదీ వరకు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా రంపచోడవరం గ్రామ సర్పంచ్ మంగ బజ్జీ విచ్చేసి శిక్షణ పొందిన వయోజన విద్య ఉపాధ్యాయులందరికీ శుక్రవారం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఆర్‌డబ్ల్యుఎల్ సహకారంతో ఒక సంవత్సరం పాటు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

నులిపురుగుల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న పిఒ చైతన్య

ప్రజాశక్తి-చింతూరు : నులిపురుగుల నివారణకు చేపట్టవలసిన చర్యలపై విద్యార్థులు, పెద్దలు అవగాహన కలిగి ఉండాలని ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. స్థానిక ఏజిహెచ్ఎస్ బాలికల పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, తరచూ చేతులను సబ్బుతో కడగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ పుల్లయ్య, ఏటిడబ్ల్యుఓ కే సుజాత, డాక్టర్ ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం, జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం చింతూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సహకారంతో జాతీయ నులిపురుగుల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతూరు సిహెచ్‌సి నుండి విచ్చేసిన వి.చిన్నలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజు చేతులు శుభ్రం చేసుకొని ఆహారాన్ని తీసుకోవాలని, ప్రోటీన్స్ ఎక్కువగా ఉన్న పదార్థాలను తినాలని, నులిపురుగుల నివారణకు ఆరు నెలలకు ఒకసారి ఆల్బండజోల్ మాత్రాలను తీసుకోవాలని, వారానికి రెండు సార్లు ఐరన్ టాబ్లెట్స్ వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం, వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

1044వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను యధావిధిగా ప్రభుత్వ రంగంలోనే నడపాలని, ఈ కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేసే నిర్ణయాన్ని రద్దు చేయాలని, జిందాల్‌తో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలు శుక్రవారం నాటికి 1044వ రోజుకు చేరాయి.

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు వినతుల వెల్లువ



వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి -అనంతగిరి: గిరిజన ప్రాంతంలో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతాలను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించ వద్దంటూ ఎస్టీ కమిషన్ చైర్మన్ డి వి జి. శంకర్రావుకు పలు వినతలు అందించారు శుక్రవారం బొర్రా గుహలను సందర్శించిన సందర్భంగా స్థానికులు, ప్రజా ప్రతినిధులు సమత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సంయుక్తంగా లిఖిత పూర్వకంగా వినతులు అందించారు. ఇటీవల కాలంలో పంచాయతీ లేకుండా బొర్రా గుహల వద్ద ప్రైవేట్ వ్యక్తుల సహకారంతో రోప్ వే నిర్మాణం చేపట్టారని, కనీసం పంచాయితీకి రాయల్టీ చెలించకుండా వ్యాపారం చేసుకుంటున్నారని తెలిపారు. వచ్చిన ఆదాయంలో కనీసం 20శాతం బొర్రా పంచాయతీకి చెల్లించినట్లయితే మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.ప్రస్తుతం బొర్రా గుహలు పర్యాటకశాఖ ఆధీనంలో నడుస్తున్నందున ఇక్కడ పనిచేసే కార్మికులు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్నామని భావిస్తున్నారన్నారు.ప్రైవేటు ఏజెన్సీతో ఉపాధి కోల్పోతున్నామని పిశ చట్టం, 1/70 ప్రకారం గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులు వ్యాపారాలు చేయకూడదని నిబంధన ఉన్నప్పటికీ అందుకు విరుద్ధంగా ప్రైవేటు ఏజెన్సీలకు కట్టబెట్టడం అన్యాయమని పిర్యాదు చేశారు. ఇప్పటికైనా గిరిజన ప్రాంతమైన బొర్రా గుహలు పరిసర ప్రాంతాలలో అభివృద్ధి చేసేందుకు పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్వహణ చేసుకుని వచ్చిన ఆదాయంలో పంచాయతీకి కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైల్వే శాఖ రెండవ లైన్ వేస్తున్న ప్రాంతము బొర్రా గుహలు మీదుగా వేయడంతో గుహలు పాడయ్యే ప్రమాదం ఉందని కమిషన్ దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. ఈ విషయాలపై స్పందించిన శంకరరావు మాట్లాడుతూ, ప్రభుత్వంతో చర్చించి గిరిజన హక్కులు కాపాడుతామని చైర్మన్ హామీ ఇచ్చారు. అనంతరం టోకూర్ బాలికల వసతి గృహంను సందర్శించి ప్రధానోపాధ్యాయులు స్వరూపరాణి ను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన బోధనతో పాటు రుచీకరమైన బోజనం అందించాలని ఆదేశించారు చైర్మన్‌కు సర్పంచులు సన్మానం చేపట్టారు ఈ పర్యటనలో ఎస్టి కమిషన్ నెంబరు కొర్రా, రామలక్ష్మి అనంతగిరి ఎంపీపీ శెట్టి, నీలవేణి స్థానిక సర్పంచ్ జె , అప్పారావు, టోకురు సర్పంచ్ కె.మొస్య ఎంపిటిసి కె.అరుణ, పాడేరు డిడి కొండలరావు, ఎండిఓ అర్చిత్ రాజ్యం తహసిల్దార్ నర్సంగమూర్తి ఎఇఒ బాలజి ఎస్సై కె.రాము తదితరులు పాల్గొన్నారు

షెడ్యూల్‌లో చేర్చాలని వినతి

అనంతగిరి: నాన్ షెడ్యూల్ పంచాయతీలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు 100 శాతం గిరిజనులకే ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం అనంతగిరి మండల కార్యదర్శి జన్ని సుబ్బారావు, టోకూరు సర్పంచ్ కిల్లో, మోస్య రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవి శంకర్రావుకి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనంతగిరి మండలంలో నాన్ షెడ్యూల్ పంచాయతీలైన భీంపోలు ,గుమ్మకోట, గరుగుబిల్లి, ఎన్ఆర్ పూరం 5 పంచాయతీలు ఉన్నాయని వంద శాతం గిరిజనులు ఉన్న నాన్ షెడ్యూల్ ఏరియాలో ఉండడంతో ఇప్పటికే గిరిజన రైతుల భూములు బడా భూస్వాముల చేతిలోకి వెళ్లి పోయాయని తెలిపారు.గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ ఉద్యోగ ఉపాధి లో అన్ని ఉద్యోగాలు గిరిజనులకే కేటాయించాలని కోరారు టోకూరు పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన స్థానిక సర్పంచ్ కిల్లో మోస్య కి ఎస్టీ కమిషన్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ మెంబర్ రామలక్ష్మీ ప్రధావన ఉపాధ్యాయులు స్వరుపా రాణి, ఉపాధ్యాయులు సూర్యకాంతం, సుశీల తదితరులు పాల్గొన్నారు

పెన్షనర్ల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ



రిలేదీక్ష శిబిరంలో మాట్లాడుతున్న అజశర్మ

ప్రజాశక్తి-కరాస: ఉద్యోగులు, పెన్షనర్లు దాచుకున్న రూ.లక్షల కోట్లను పెట్టుబడిదారులకు ధారపోసి, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ మండిపడ్డారు. కనీస పెన్షన్ రూ.9వేలు అమలు, వైద్యసదుపాయం కల్పించాలన్న న్యాయమైన డిమాండ్‌తో రోడ్డెక్కి ఆందోళన చేస్తున్న ఇపిఎఫ్ 95 పెన్షనర్లను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. శుక్రవారం మర్రిపాలెం ఇపిఎఫ్ కార్యాలయం వద్ద ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ ఆధ్వర్యంలో నిరవధికంగా ఐదోరోజు కొనసాగించిన నిరవధిక రిలే దీక్షలో పాల్గొని మాట్లాడారు. ధరాభారంతో ఇస్తున్న పెన్షన్ ఎటూ సరిపోక జీవనం దుర్భరమౌతోందని, కనీస పెన్షన్‌ను రూ.9వేలుకు పెంచాలని, పెన్షనర్ల దంపతుల ఆరోగ్యానికి భరోసాగా వైద్యసదుపాయం కల్పించాలన్న కనీస కోరికను తీర్చాల్సిన బాధ్యత నుంచి ప్రభుత్వాలు తప్పుకోవడం దుర్మార్గమన్నారు.పెన్షనర్ల నుంచి రికవరీ చేసిన సొమ్మును బట్టి ఒక్కొక్కరికీ కనీసం రూ.6,886 నెలసరి పెన్షన్ ఇవ్వొచ్చని, అదే సొమ్మును బ్యాంకులో జమచేస్తేవచ్చే వడ్డీలతో కలుపుకుంటే ప్రస్తుతమిస్తున్న దానికన్నా రెండుమూడు రెట్లు అధికంగా పొందవచ్చున్నారు, ఇపిఎఫ్ పెన్షనర్ల సొమ్ములను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు కట్టబెట్టి, వీరికి మొండిచేయి చూపడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం తన బాధ్యతను గుర్తెరిగి, పెన్షనర్ల కోరికను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బిటి. మూర్తి, దీనబంధు, ఉపాధ్యక్షుడు యువిఎస్.శర్మ, ఎస్‌కె. హుస్సేన్, నారాయణరావు, కె.సూర్య నాయుడు, చంద్ర శేఖరరావు, అప్పలరాజు, బాలాజీ, రామారావు, అప్పారావు, ప్రసాద్, వివిధ పరిశ్రమల పెన్షనర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి

సిపిఎమ్‌కు మద్దతు తెలియజేయండి

ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం



చింతూరులో విరాళాలను సేకరిస్తున్న సిపిఎం నేతలు



విఆర్‌పురంలో సిపిఎం కార్యకలాపాలపై సిపిఎం నేతల కరపత్రాల ప్రచారం

ప్రజాశక్తి-చింతూరు : కంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని, సిపిఎంకు మద్దతు తెలియజేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి సంతలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం కరపత్ర ప్రచారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సీతారాం మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై జరుగు ఉద్యమాల్లో ప్రజల్లో భాగస్వాములు కావాలని కోరారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతూ దేశాన్ని నిరుద్యోగం వైపు నడిపిస్తోందని విమర్శించారు. ఈ సమస్యను ప్రజలు ప్రశ్నించకుండా ఉండేటందుకే అబద్ధాలు చెబుతూ లౌకికవాద విధానానికి తూట్లు పొడుస్తున్నారని, ఆర్ఎస్ఎస్ హిందుత్వ ఏజెండాను ముందుకు తీసుకువస్తున్నారని విమర్శించారు. ప్రజలను ఎంతో కాలం మోసం చేయలేరన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపికి మద్దతు తెలియజేస్తున్న రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేనకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. దేశవ్యాప్తంగా వామపక్ష ప్రజాతంత్ర శక్తులను బలపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు మల్లం సుబ్బమ్మ, మురం రంగమ్మ, పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, సవలం కన్నయ్య, వీరబోయిన దిలీప్ పాల్గొన్నారు.

ప్రజా సేవలు సిపిఎం ముందంజ

విఆర్ పురం : ప్రజల కష్టాల్లో పాలు పంచుకుంటూ వారికి ఇతోధికంగా సేవ చేయడంలో సిపిఎం ఎప్పుడూ ముందే ఉంటుందని ఆ పార్టీ నాయకులు అన్నారు. మండలంలోని శ్రీరామగిరి పంచాయతీ పరిధి చొక్కానాపల్లి గ్రామంలో సిపిఎం బృందం కరపత్రాలు పంచుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన పనులను ఎండగడుతూ సిపిఎం చేసిన త్యాగాలను, పోరాటాలను ప్రజలకు తెలియజేశారు. ఈ క్యార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల నాయకులు తోడం రాజు, జి.లక్ష్మణరావు, కాంతారావు, సిహెచ్..సుబ్బారావు, శాఖ కార్యదర్శి గొంది, దారయ్య, సభ్యులు తోడం సీతారామయ్య, రమేష్. మధు తదితరులు పాల్గొన్నారు

అట్టహాసంగా ఆడుదాం - ఆంధ్ర

- విశాఖలో రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆడుదాం - ఆంధ్ర రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు విశాఖ వేదికగా శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 26 జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు, అధికారులు, రాజకీయ ప్రముఖుల సమక్షంలో బెలూన్లను ఎగురవేసి రాష్ట్ర పర్యాటక, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి ఆర్‌కె.రోజా క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న, శాప్ ఎమ్‌డి ధ్యాన్ చంద్ర, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఇతర అధికార, రాజకీయ ప్రముఖులతో కలిసి జాతీయ పతాకాన్ని, శాప్ పతాకాన్ని ఆవిష్కరించారు. క్రీడాకారులందరి చేతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అధికారులతో కలిసి 26 జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడుదాం - ఆంధ్ర అనేది అందరి ఆట.. బంగారు భవిష్యత్తుకు బాట..అని ప్రసంగిస్తూ క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్దపీట వేసిందని, క్రీడాకారులకు ఉన్నతమైన స్థానం కల్పించిందని పేర్కొన్నారు. 15,400 సచివాలయాల పరిధిలో వివిధ దశల్లో ఆడుదాం - ఆంధ్ర ద్వారా ఎంతో మందిని ఈ క్రతువులో భాగస్వామ్యం చేశామని గుర్తు చేశారు. క్రీడాకారులు తమ ఆటపై ఫోకస్ పెట్టాలని, ఉన్నత స్థానాలకు చేరుకునే వరకు విశ్రమించవద్దని సూచించారు. అందరి లక్ష్యం గెలుపే కావాలని, ఆ దిశగా నిరంతరం శ్రమించాలని అన్నారు. శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని, చిన్నచిన్న కామెంట్లను పరిగణనలోకి తీసుకొని కుంగిపోవద్దని సూచించారు. శాప్ ఎమ్‌డి ధ్యాన్ చంద్ర మాట్లాడుతూ డిసెంబర్ 26న ఆరంభమైన క్రీడలు 41 రోజుల నుంచి నిరంతరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ నెల 13వ తేదీన విశాఖలోని ఎసిఎ విడిసిఎ క్రికెట్ స్టేడియంలో ముగింపు వేడుకలు ఉంటాయని చెప్పారు. ఆడుదాం - ఆంధ్ర క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 37.35 లక్షల మంది రిజిస్టర్ చేసుకోగా అందులో 13.77 లక్షల మంది మహిళా క్రీడాకారులు ఉండటం విశేషమని అన్నారు. ఇప్పటి వరకు జరిగిన క్రీడల్లో విజేతలకు రూ.12 కోట్లతో బహుమతులు అందజేశామని, రాష్ట్ర స్థాయి విజేతలకు రూ.87 లక్షలతో బహుమతులు అందజేయనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశాఖ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, డిసిసిబి ఛైర్మన్ కోలా గురువులు, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జెసి కె.మయూర్ అశోక్ పాల్గొన్నారు.

14 నుంచి గీతంలో 'సంయుక్త-24'

మూడు రోజులపాటు అంతర్జాతీయ యువజనోత్సవం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గీతం రిజిస్ట్రార్ గుణశేఖరన్

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో విదేశీ విద్యార్థుల ఆధ్వర్యంలో 'సంయుక్త-24' పేరిట ఈ నెల 14 నుంచి 16 వరకు అంతర్జాతీయ విద్యార్థుల యువజనోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం డైరక్టర్ డాక్టర్ కె.పి.కిషన్ తెలిపారు. శుక్రవారం దీనికి సంబంధించిన ప్రచారపోస్టర్లను అంతర్జాతీయ విద్యార్థుల సమక్షంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్టడీ ఇండియా కార్యక్రమం ద్వారా గీతంలో ప్రవేశాలు పొందిన విదేశీ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాణించడంపై రిజిస్ట్రార్ అభినందనలు తెలిపారు. సంయుక్త యువజనోత్సవం ద్వారా విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించే అవకాశం లభిస్తుందన్నారు.

యువజనోత్సవంలో క్రీడా పోటీలతో పాటు సంగీత, నృత్య కార్యక్రమాలు, విదేశీ వంటకాలతో ఫుడ్‌ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ విద్యాసంస్థల నుంచి 150 మంది విదేశీ విద్యార్థులు ఈ ఉత్సవాలకు తమ పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. ఉత్సవాలలో పాల్గొనాలని ఉగాండ, టాంజానియా దేశాల రాయబారులను, విద్యావేత్తలను ఆహ్వానించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో క్యాంపస్ లైఫ్ డీన్ ఎమ్.బాలాకుమార్ పాల్గొన్నారు.

నకిలీ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు జారీ దారుణం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ఏజెన్సీలో నకిలీ ఎస్టీ సర్టిఫికెట్లు రద్దు చేయాలని జేఏసీ అల్లూరి జిల్లా కన్వీనర్ రామారావు దొర డిమాండ్ చేశారు. శుక్రవారం జేఏసీ అధ్వర్యంలో గిరిజనులతో ఎన్టీఆర్ గ్రౌండ్ నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల తహసిల్దార్ పి.సోమేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం జేఏసీ అల్లూరు జిల్లా కన్వీనర్ రామారావు దొర మాట్లాడుతూ.సుంకరమెట్ట పంచాయతి బంగ్లావలస, సుంకరిమెట్ట,జడ్డిపనస,చిన్నగంగుడి గేటువలస పరిసర గ్రామాల ఆదివాసులపై పెత్తనం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గిరిజనులపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. జగనన్న సురక్ష పథకం కింద ఏజెన్సీలో అనేక దొంగ కుల దబుకరణ పత్రాలు జారీ అయ్యాయన్నారు. కార్యక్రమంలో జేఏసీ మండల కన్వీనర్ గోపాల్ రావు, కో కన్వీనర్లు, ఏల్ మహదేవ్, కె ఆనంద్, బుద్ధు, రామచందర్, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే ఎంపీగా పోటీ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అవకాశం ఇస్తే వైసిపి పార్టీ నుండి అరకు ఎంపిగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని గిరి జాగృతి అసోసియేషన్ కోశాధికారి కొరతం ఈశ్వరరావు తెలియజేశారు. శుక్రవారం అరుకులోయలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు గిరి జాగృతి అసోసియేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. విద్య, వైద్యం వంటి సేవ కార్యక్రమాలు గిరిజనులకు పలు రూపాలుగా అందించినట్లు చెప్పారు.ముఖ్యంగా కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి ఎంతోమంది ప్రాణాలను కాపాడినట్లు తెలిపారు.

ఈ - శ్రమ్ కార్డులతో లబ్ధి

ప్రజాశక్తి -పాడేరు :భారత ప్రభుత్వం కార్మిక శాఖ పేద బడుగు వర్గాలకు మేలు చేసే విధం గా రూపొందించిన ఈ శ్రమ్ కార్డ్ ఎంతోమంది కార్మికులకు ప్రయోజనం చేకూరిస్తోందని, అల్లూరి జిల్లా సహాయ కార్మిక అధికారి సూర్య నారాయణ తెలిపారు. తశుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, హుకుంపేట మండలం బొందులమామిడి, బెల్లాయిపుట్టు గ్రామానికి చెందిన ఈ శ్రమ్ కార్డు ద్వారా రెండు లక్షల రూపాయలు బీమా పొందారని తెలిపారు. ఈ శ్రమ్ కార్డులు తప్పనిసరిగా సంబంధిత సచివాలయం లో చేయించుకోవాలని తెలిపారు.

డీజిల్‌కు డబ్బులు చెల్లించని వారిపై ఫిర్యాదు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జిసిసి పెట్రోల్ బంకులో డీజిల్ కొట్టించుకొని రూ.4వేలు చెల్లించకుండా కారుతో యువకులు పరారైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. జిసిసి పెట్రోల్ బంకు బాయ్ కిల్లో సుకుదాస్ తెలియజేసిన వివరాలు ప్రకారం... ఈ నెల 7న బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత డొంకరాయి వైపు నుంచి సీలేరు మీదగా ఒక తెల్లటి కారు పెట్రోల్ బంకుకు వచ్చిందని పేర్కొన్నారు. కారులో ఉన్న యువకులు తమ దగ్గర డబ్బులు లేవని, 40 లీటర్లు డీజిల్ కొడితే ఫోన్ పే చేస్తామని చెప్పడంతో డీజిల్ కొట్టారు.

అనంతరం బంక్ బోయి కిలో సుగుదాస్ ఆఫీసులో ఉన్న పేటీఎం స్కానర్ తేవడానికి వెళ్లి వచ్చేలోగా కారుతో ఉన్న యువకులు సినీ పక్కిలో ఏపీ జెన్కో చెక్‌పోస్టు నుంచి దారకొండ వైపు పుడాయించారు. డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోతున్నారని నైట్ డ్యూటీలో ఉన్న సుఖ దాసు, భీశెట్టి శివ పెద్ద పెద్ద కేకలు వేసినా కారును నిలుపుదల చేయకుండా అతివేగంగా వెళ్లిపోయారు. దీంతో కారును ఆపేందుకు వీరు ద్విచక్ర వాహనంపై కారును ఆపేందుకు సుమారు రెండు కిలోమీటర్ల వరకు రాత్రి సమయంలో వెంబడించినా ఫలితం లేకపోయింది. అప్పటికే అతి వేగంతో కారుతో యువకులు పరారయ్యారు. ఈ విషయాన్ని సీలేరు జిసిసి బంకు ఎకౌంటు అధికారి చిటికెల రమణకు సమాచారం ఇచ్చారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లో జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేశారు.

నేరాలు ఘోరాలు

కారు ఢీకొని బైకిస్ట్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- మోతుగూడెం : మోతుగూడెం -పోల్లూరు ప్రధాన రహదారిపై గురువారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న పశ్చిమగోదావరి జిల్లా దువ్వ గ్రామానికి చెందిన అంగ చంద్రశేఖర్ అనే వ్యక్తికి కాలు విరిగింది. ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు ఆగకుండా వెళ్లిపోవడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న మరో వ్యక్తి కారును వెంబడించి పట్టుకున్నారు. క్షతగాత్రుడిని హుటాహుటిన ఏపీ జెన్కో ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఆసుపత్రికి తీసుకెళ్లిరు. మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు కేసు విచారణ చేపడుతున్నారు. కాలు విరిగిన చంద్రశేఖర్ పోల్లూరులో పిఈఎస్ కంపెనీలో పని చేస్తున్నాడు.

10 కేజీల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడ్డ నిందితునితో పోలీసులు

ప్రజాశక్తి -మోతుగూడెం :చింతూరు మండలం, మోతుగూడెం చెక్ పోస్ట్ వద్ద పోలీస్‌లు వాహనలు తనిఖీ చేస్తుండగా 10 కేజీల గంజాయి పట్టుబడినట్లు మోతుగూడెం ఎస్ఐ తెలిపారు. వాహనతనిఖీల్లో భాగంగా సీలేరు వైపు నుండి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా 10 కేజీల గంజాయి పట్టుబడింది. దీంతో బైక్‌పై వెళ్తున్న కళ్యాణ్ కుమార్, నరేందర్ అనే ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని వారి దగ్గరున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ రూ.50వేలు ఉంటుంది. ఈ గంజాయిని మహబూబాబాద్ వివేకానగర్‌కు తీసుకెళ్తున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాలరావు తెలిపారు.